క్లుప్తంగా

కేజీబీవీలో ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలో చెట్టుపల్లి తండాలోని కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



జినుగుర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

తాండూరు రూరల్: జినుగుర్తి ప్రాథమిక పాఠశాలలో తాండూరుకు చెందిన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులను సన్మానించారు. జినుగుర్తి పాఠశాల హెచ్ఎం నాగప్ప, ఉపాధ్యాయులు జయశ్రీ, స్వప్నకుమారి, భాగ్యశ్రీ, భానుప్రకాశ్, నర్సిములును శాలువా కప్పి పూలమాల వేసి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శరణు బసప్ప, ట్రెజరర్ గౌరిశంకర్, క్యాబినెట్ సెక్రెటరీ సల్లా దామోదర్, జిల్లా చైర్మన్ బస్వరాజ్, మెంబర్ జయంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో..



తాండూరు టౌన్: శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ కళాశాల సిబ్బంది

తాండూరు టౌన్: తాండూరు మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ మందిర్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌నాయక్‌ను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. శ్రీసాయిమేధ పాఠశాలలో కరస్పాండెంట్ పి వెంకట్‌రెడ్డి సౌజన్యంతో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కృష్ణవేణి, అనిత, మహేశ్వరిలను ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెమెంటో అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. పట్టణంలోని పీపుల్స్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఉత్తంచంద్ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

ఖైరతాబాద్ బడా గణేశ్ శోభాయాత్రలో..

వలంటీర్‌గా బంట్వారంవాసి సంజీవ్‌కుమార్



శోభాయాత్రలో సంజీవ్‌కుమార్

బంట్వారం: ఖైరతాబాద్ బడా గణేశ్ శోభాయాత్రలో బంట్వారం నివాసి మొగ్దుంపురం సంజీవ్‌కుమార్ వాలంటీర్‌గా సేవలందించారు. శనివారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బడా గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్



చెక్కు పంపిణీ చేస్తున్న రవి నాయక్

దుద్యాల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని సత్తర్‌కుండ తండాకు చెందిన దేవాకు మంజూరైన రూ.50వేల చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అనారోగ్యానికి గురైనప్పుడు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవడానికి ప్రభుత్వం ఈ నిధిని సాయంగా అందజేస్తుందన్నారు. అర్హులు సీఎం సహాయనిధిని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

పడకేసిన పశువైద్యం!

జిల్లాలోపశువైద్యం కరువైంది. మూగజీవాలు వ్యాధుల బారిన పడితే వైద్యం అందించే వారు లేక మృత్యువాత పడుతున్నాయి. కొన్ని చోట్ల సిబ్బంది కొరత, ఇంకొన్ని ప్రాంతాల్లో సమయానికి విధులకు హాజరుకాని సిబ్బందితో వైద్యం అందడం లేదు. ఏది ఏమైనప్పటికీ సీజనల్ వ్యాధులు సోకకుండా పశువైద్యులు సేవలు అందిస్తే రైతులకు, పశుకాపరులకు మేలు కలుగుతుంది.

గాలిలో దీపంలా వైద్యం
- సమయానికి తెరుచుకోని ఆస్పత్రులు
- చాలాచోట్ల సేవలందిస్తున్న అటెండర్లు
- పీడిస్తున్న సిబ్బంది కొరత
- జిల్లాలో తెల్లజాతి పశువులు 1,33,316
- నల్లజాతి జీవాలు 66,023



కొడంగల్ రూరల్: కొడంగల్‌లో దూడకు టీకా వేస్తున్న ఎల్ఎస్ఏ శేఖర్

వికారాబాద్: జిల్లాలో పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. సిబ్బంది, మందుల కొరత వేధిస్తోంది. సీజనల్ వ్యాధులు ప్రబలే తరుణంలో డాక్టర్లు, సిబ్బంది విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో రైతులు మూగజీవాలతో ఆస్పత్రుల వద్ద నిత్యం పడిగాపులు కాయాల్సి వస్తోంది. కొన్ని కేంద్రాల్లో అటెండర్లు, కాంపౌండర్లు వైద్య సేవలందిస్తున్నారు. సాధారణ వైద్యం మొదలు కృత్రిమ గర్భధారణ వరకు అన్ని పరీక్షలు వారే చేస్తున్నారు.

జిల్లాలో పశువుల సంఖ్య ఇలా..

జిల్లాలో ఆవులు, ఎద్దులు, దూడలు వంటి తెల్లజాతి పశువులు 1,33,316 వరకు ఉన్నాయి. గేదెలు, దున్నలు తదితర నల్లజాతి పశువులు 66,023, గొర్రెలు 2,08,771, మేకలు 2,55,155 ఉన్నాయి. గుర్రాలు 127, గుర్రం పిల్లలు(పోని) 20, గాడిదలు 83, ఒంటెలు 7, పందులు 10,383, పెంపుడు కుందేళ్లు 99, కుక్కలు 4,338 ఉన్నాయి.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

నియోజకవర్గ, మండల స్థాయి పశువైద్య శాలలతో పాటు స్థానిక ఎస్‌సీహెచ్‌లు కలిపి జిల్లాలో మొత్తం 96 ఉన్నాయి. ఏడీ పోస్టులు ఏడు ఉండాల్సి ఉండగా ఆరుగురే ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు 34 ఉండాల్సి ఉండగా 27, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 17 మందికి గాను 12, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు 33 మందికి 19, వెటర్నరీ అసిస్టెంట్లు 25 మందికి గాను 04 మాత్రమే ఉన్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 71 ఉండాల్సి ఉండగా 68 మందే ఉన్నారు.

వైద్యం అందక..

దోమ: మండలంలో రెండు పశువైద్యశాలలు ఉండగా, నాలుగు సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో ఇద్దరు డాక్టర్లు, ఓ లైవ్‌స్టాక్ అధికారి ఉండగా ముగ్గురు సెలవులపై వెళ్లినట్లు తెలిపారు. దీంతో వైద్యశాల 10.30 దాటినా తెరుచుకోకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఊటుపల్లికి చెందిన పాండు తన మేక అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి తీసుకొచ్చారు. కానీ అక్కడ వైద్యులు లేకపోవడంతో కొద్దిసేపు నిరీక్షించారు. ఎంతకు వైద్యులు రాకపోతే ఆస్పత్రి గోడపై అవుట్‌సోర్సింగ్ అటెండర్ ఫోన్ నంబర్ ఉండడంతో అతనిని ఫోన్‌లో సంప్రదించి వైద్యం చేయించుకున్నారు.



వైద్యులు రాకపోవడంతో పశువైద్యశాలకు తాళం

తెరుచుకోని పశువైద్యశాల



దుద్యాల్: మూసి ఉన్న వైద్యశాల

దుద్యాల్: మండల కేంద్రం ఏర్పాటయ్యి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇక్కడ పశువైద్యం అందుబాటులో రాలేదు. మండలానికి ఒక్క పశువైద్యాధికారిని కూడా కేటాయించకపోవడం బాధాకరం. ఇటీవల వీఆర్ఏ క్యాడర్ నుంచి వచ్చిన ఉద్యోగితో కాలం వెళ్లదీస్తున్నారు. శనివారం ఆయన సెలవులో ఉండడంతో పశువైద్యశాల తెరుచుకోలేదు. అంతేకాకా ఆయనకు పూర్తి స్థాయి వైద్యం రాకపోవడంతో పశువులకు సరైన వైద్యం ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొంరాస్‌పేట్ పశువు వైద్యులను దుద్యాలకు ఇన్‌చార్జిగా కేటాయించినప్పటికీ సక్రమంగా రావడంలేదని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. వెంటనే దుద్యాలకు పశువైద్యులను నియమించాలని కోరుతున్నారు.


గెటికరోగంతో చనిపోతున్నాయ్



గాజీపూర్‌లో గొర్రెకు మందు వేస్తున్న కాపరి బిచ్చప్ప

తాండూరు రూరల్: ఈ ఫొటోలో ఉన్న కాపరి పేరు బుద్దారం కుర్వ బిచ్చప్ప. పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామం. తన వద్ద ఉన్న 200 గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తుంటాడు. వర్షా కాలంలో గెటికరోగం వచ్చి చనిపోతున్నాయని చెబుతున్నాడు. పశు వైద్యుడి వద్దకు తీసుకెళ్లితే మందులు తమ వద్ద అందుబాటులో లేవని తాండూరు నుంచి తెచ్చుకోవాలని చెబుతున్నారు. ఇప్పటికే గెటికరోగం ప్రబలి గొర్రెలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పోస్టులు ఖాళీ..



బషీరాబాద్‌లో డాక్టర్ గదికి తాళం

బషీరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూగజీవాలు రోగాల బారిన పడుతున్నాయి. బషీరాబాద్, గొట్టిగఖుర్దు గ్రామాల్లో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు, మైల్వార్, రెడ్డిఘణాపూర్‌లో ఉప కేంద్రాలు ఉన్నాయి. రెండు కేంద్రాల్లో కలిపి ఆరు వైద్య పోస్టులకు అన్నీ ఖాళీలు ఉన్నాయి. దీనికి తోడు పశువులకు ఇచ్చే ఒక్క మందు కూడా లేదు. దీంతో సకాలంలో వైద్యం అందక 12 పశువులు, 50 మూగజీవాలు మృతి చెందాయి.

8 నెలలుగా మందుల సరఫరా బంద్

ప్రతీ వైద్యకేంద్రంలో పశువులకు సంబంధించి పెన్సిలిన్, యాంటీబయోటిక్, యాంటీ ఇస్టానిల్స్, యాంటీపాయిలెటీస్, యాంటి స్టిరాయిడ్స్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండాలి. 8 నెలలుగా వాటి సరఫరా నిలిచిపోయింది.

సబార్డినేటర్లే దిక్కు

చెంగోల్, మల్కాపూర్‌లో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ఆఫీస్ సబార్డినేటర్లే చికిత్స అందిస్తున్నారు. చెంగోల్ పరిధిలో జినుగుర్తి సబ్ సెంటర్ వస్తోంది. జినుగుర్తిలో పని చేస్తున్న బాలకృష్ణ చెంగోల్ పశువైద్య కేంద్రంలో కూడా విధులు నిర్వహించారు. గతంలో వైద్యులు లేకపోవడంతో తను కూడా పశువులకు చికిత్స చేశారన్నారు. ప్రస్తుతం చెంగోల్‌కు డాక్టర్ వెంకటేశాన్ని నియమించారు.



తాండూరు రూరల్: చెంగోల్‌లోని ప్రాథమిక పశువైద్య కేంద్రం

అందుబాటులో 131 రకాల మందులు



చికిత్స అందిస్తున్న సిబ్బంది

యాలాల: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో జీవాలకు సంబంధించిన వ్యాక్సిన్, టీకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. మండల పశువైద్యుడితో పాటు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. శనివారం పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ అందుబాటులో ఉండి ఆస్పత్రికి వచ్చిన జీవాలకు చికిత్స అందజేశారు. దేవనూరు, తిమ్మాయిపల్లి, అగ్గనూరు, పగిడియాల సబ్ సెంటర్ పరిధిలో సిబ్బంది కొరత ఉంది.

పట్టణంలో అందని వైద్యం

తాండూరు: మండల కార్యాలయాల ఆవరణలో ఉన్న పశువైద్యశాలలో వైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువులకు, పిల్లులు, కుక్కలకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యులు కొన్ని నెలలుగా ఆస్పత్రికి రావడం లేదు. ఇక్కడ వైద్యసేవలు నిర్వహిస్తున్న ఏడీఏ 6 నెలల క్రితం బదిలీపై వెళ్లారు. దీంతో కొడంగల్ ఏడీఏ డాక్టర్ నోవాకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఒక్క రోజు కూడా ఆస్పత్రికి రాలేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు సిబ్బంది సైతం ఏడీఏ బాటలో నడుస్తున్నారు. వారు విధులకు సక్రమంగా రావడంలేదని వివరిస్తున్నారు. దీంతో ఆస్పత్రి నిర్వహణ లేకపోవడంతో అధ్వాన్నంగా తయారైంది.



తాండూరు పశువుల ఆస్పత్రి

వైద్యం, మందులు లేక ..



మందులు సరఫరా చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

మర్పల్లి: పశువులకు, జీవాలకు సకాలంలో వైద్యం, మందులు అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మర్పల్లి ఆస్పత్రిలో విధులు నిర్వహించే ఏడీ విజయలక్ష్మి వికారాబాద్ పశువుల ఆస్పత్రిలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించకపోవడంతో సిబ్బందే తోచిన వైద్యం చేయడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. కొంత కాలంగా మందుల నిల్వలు లేకపోవడంతో బయటనుంచి తెప్పించుకొని వైద్యం చేయించుకుంటున్నామని రైతులు వాపోతున్నారు. శనివారం సాక్షి విజిట్ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి. 9 గంటలకు తెరువాల్సిన ఆస్పత్రిని 9.30 గంటలకు సిబ్బంది రమేశ్ తెరిచారు.

వైద్యులు, సిబ్బంది ఉండరు



మూడు రోజుల నుంచి ఆస్పత్రి చుట్టూ తిరిగినా డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉండరు. నాదగ్గర ఉన్న జీవాలలో ఒక మేక పిల్ల 3 రోజుల క్రితం అస్వస్థతకు గురైంది. వైద్యం కోసం మేకపిల్లను తీసుకొస్తే ఆస్పత్రిలో ఎవ్వరూ లేరు. ప్రతిరోజు 20 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నా వైద్యం చేయడం లేదు. ఇక్కడ సిబ్బందే డాక్టర్లు. మందులు లేకపోవడంతో సంగారెడ్డి జిల్లా కంభోల్‌లోని మెడికల్ హాల్‌నుంచి మందులు తెస్తున్నాం. 10 గంటల వరకు ఆస్పత్రిని తెరువరు. మధ్యాహ్నం 3 గంటలకే మూసేస్తారు.

– మల్లేశం, రైతు, మర్పల్లి

అంగడిరాయిచూర్, రుద్రారం గ్రామాల్లో ..

కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్, రుద్రారం గ్రామాల్లో పశువైద్యశాల, సబ్ సెంటర్లు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొడంగల్, రావులపల్లిలో రెండు పశువైద్యశాలలు, ఎరన్‌పల్లిలో సబ్‌సెంటర్ ఉంది. కొడంగల్‌లో ఏడీ, వీఏ, ఓఎస్‌లు, రావులపల్లి పశువైద్యశాల డాక్టర్ ఇటీవలే ఎన్నికల శిక్షణకు వెళ్లారు. దీంతో అక్కడ కేవలం కాంట్రాక్ట్ పద్ధతిలో ఓఎస్ మాత్రమే పనిచేస్తున్నారు. ఎరన్‌పల్లిలో జేవీఓ వెంకటయ్య, అటెండర్లు విధులు నిర్వహిస్తున్నారు. అంగడిరాయిచూర్, రుద్రారంలో పశువైద్య కేంద్రాలు లేకపోవడంతో అనారోగ్యం బారిన పడిన పశువులను రావులపల్లి లేదా కొడంగల్ గ్రామాలకు తీసుకెళ్లాలి. రోగాలతో ఇబ్బందిపడుతున్న పశువులను 8 కిలోమీటర్లు ఎలా తోలుకపోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పాము కాటుకు చికిత్స అందక పాడి ఆవు మృతి

బంట్వారం: పాము కాటుకు చికిత్స అందక పాడి ఆవు శనివారం మృత్యువాత పడింది. నాగసాన్‌పల్లికి చెందిన బంటు నాగేశ్ తన పాడి ఆవును పొలం వద్ద మేతకు తీసుకెళ్లాడు. రోజుమాదిరి షెడ్డులో కట్టేశాడు. కొద్ది సేపటి తర్వాత షెడ్డు వద్దకు వెళ్లి చూడగా పాము కాటు వేసిందని గుర్తించాడు. స్థానికంగా పశువైద్యం అందుబాటులో లేకపోవడంతో ట్రక్కులో ఆవును వేసుకుని వికారాబాద్‌లోని పశువైద్యశాలకు బయలుదేరాడు. అప్పటికే ఆవు మృతి చెందిందని బాధిత రైతు నాగేశ్ గ్రహించాడు. సకాలంలో పాముకాటుకు చికిత్స అందించి ఉంటే ఆవు బతికేదని పేర్కొన్నారు.



మృత్యువాతపడిన పాడి ఆవు

సిబ్బందే వైద్యం చేస్తున్నారు..

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలోని పశువైద్య ఉపకేంద్రం మూతపడి ఉంది. కాంట్రాక్టు సిబ్బంది ఒకరు ఉన్నప్పటికీ తెరువలేదు. బీరోల్, ఎన్నారం ఉపకేంద్రాలకు పశువైద్య సిబ్బంది లేకపోవడంతో వైద్యం సకాలంలో అందడం లేదు. ఆరు నెలలుగా మందుల కొరత తీవ్రంగా ఉండేది. రెండు రోజుల క్రితం అరకొరకగా కొన్ని సరఫరా చేసినట్లు తెలిసింది. పాము, కుక్క కాటుకు మందులు లేవు. సకాలంలో వైద్యం అందక మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. బంట్వారం, తొర్మామిడిలో విధులు నిర్వహించే డాక్టర్‌ని ధారూరుకు ఇన్‌చార్జిగా నియమించడంతో అక్కడే ఉంటున్నారు. దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బంది వైద్యం చేస్తున్నారు.



కోట్‌పల్లిలో మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

పశు వైద్యం అంతంతే



పరిగిలో చికిత్స చేస్తున్న ఎల్ఎస్ఏ శిల్ప

పరిగి: పట్టణ కేంద్రంతో పాటు, మండలంలోని ఆయ గ్రామాల్లో పశు వైద్యం అంతంగానే అందుతుందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యశాలల్లో సరైన మందులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పాడి రైతులు వివరిస్తున్నారు. చికిత్సల కోసం మందులు అందుబాటులో లేక పోవడంతో బయట మెడికల్ దుకాణాల్లోంచి తెప్పించి వైద్యం చేస్తున్నారని చెబుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన పశు వైద్యశాల మధ్యాహ్నమే మూసేస్తున్నారు.

సేవలు కరువు



ధారూరు: వైద్యం కోసం వచ్చిన మేకల కాపరి

ధారూరు: పశు ఆస్పత్రిలో అరకొర మందులు, ఇంజెక్షన్ల లేకపోవడంతో ప్రైవేటు మెడికల్ హాల్‌కు పంపిస్తున్నారు. పెన్సిలిన్ ఇంజెక్షన్లు అందుబాటులో లేవు. మేకలు, పశువులకు విరేచనాలు వస్తే పౌడర్ ప్యాకెట్ చేతిలో పెట్టి ఇంజెక్షన్లకు ప్రైవేట్ మెడికల్ హాల్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్‌ను మద్దులచిట్టెంపల్లికి, బంట్వారంలోని తొర్మామిడిలో పనిచేస్తున్న డాక్టర్‌ను ధారూరుకు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఆయన పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పశు యజమానుల పడిగాపులు

బొంరాస్‌పేట: మూగజీవాల గోస పట్టించుకునే వారు కరువయ్యారు. పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రమీల నిత్యం హైదరాబాద్ నుంచి రాకపోకలు చేస్తున్నారు. దీంతో సమయపాలన కరువై ఉదయం నుంచి సాయంత్రం వరకు పశు యజమానులు పడిగాపులు కాస్తున్నారు. చేసేదేమిలేక అటెండరు మణెమ్మ సేవలందిస్తున్నారు. ఆరు సబ్‌సెంటర్లలో రేగడిమైలారం, తుంకిమెట్ల యేళ్లుగా మూతబడ్డాయి. రెండు జేవీఓ పోస్టుల్లో ఒకటి ఖాళీ, వీఎల్ఓ, ఎల్ఎస్ఏ డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆరుగురు అటెండర్లలో ముగ్గురు విధుల్లో సక్రమంగా ఉండడం లేదు. ఒకరు డిప్యూటేషన్ వెళ్లగా, రెండు ఖాళీ ఉన్నాయి. ఎఫ్ఆర్ఎస్ విధుల కు ఎగనామం పెడుతున్నారు. మండల పశువైద్యాధికారి సైతం హాజరు కావడంలేదని చెబుతున్నారు. కనీస సమాచారం లేకుండా వెళ్లేవారికి గైర్హాజరు వేస్తున్నట్లు డీఏవీహెచ్ఓ సదానందం పేర్కొన్నారు.



టీకా ఇస్తున్న అటెండరు మాణెమ్మ

స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎంపీడీవో మహేశ్‌కుమార్
- ఓటరు తుది జాబితా విడుదల

దుద్యాల్: స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీవో మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 8 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ ఉన్నట్లు వివరించారు. ప్రతి స్థానానికి ఎంత మంది ఓటర్లు ఉన్నారనే వివరాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా 21,078 ఓటర్లు ఉండగా వారిలో మహిళలు–10,830, పురుష ఓటర్లు–10,248 ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది రాజు, గ్రామస్తులు ఖాజా, కృష్ణ పాల్గొన్నారు.



దుద్యాల్: ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీవో మహేశ్‌కుమార్ తదితరులు



కుల్కచర్ల: ఓటర్ జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ తదితరులు

ఎంపీటీసీల వారీగా..

కుల్కచర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించినట్లు కుల్కచర్ల ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 12ఎంపీటీసీల ఓటర్ జాబితాను ప్రకటించారు. మొత్తం 38,387మంది ఓటర్లు ఉండగా 19,066 పురుషులు, 19,316 మహిళలు, 5మంది ఇతరులుగా ఉన్నారని ఆయన తెలిపారు.

చౌడాపూర్‌లో..

చౌడాపూర్ మండలంలో 9ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు ఎంపీడీవో సోమలింగం పేర్కొన్నారు. మొత్తం 25,156 ఓటర్లు ఉండగా 12,742పురుషులు, 12,413మహిళలు, ఒకరు ఇతరులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్ల వివరాలు సిద్ధం

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్ల వివరాలు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రాములు తెలిపారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు బోర్డుపై జాబితాను ప్రదర్శించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై 8న సూచనలు స్వీకరిస్తామన్నారు.

కోట్‌పల్లిలో..

ముసాయిదా ఓటరు జాబితాను కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రదర్శించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622